
# 'టెలుగూస్'!



— దేవరకొండ గంగాధర రామారావు

అది నేను మొదటిసారిగా బొంబాయి వెళ్ళడం. బొంబాయిలో మా మేనత్త వుంది. ఎన్నాళ్ల నుంచో రమ్మని రాస్తోంది. మా కాలేజికి సెలవులివ్వగానే వెళ్లాను. బొంబాయి అద్భుతంగా వుంది. ఆకాశన్నంటే మేడలూ, రకరకాల మనుష్యులూ, వింత, వింత ఫ్యాషన్లూ నన్నెంతగానో ఆకర్షించాయి. అన్నట్టూ వెళ్ళగానే మా అత్తయ్య నా వేషం చూసి నవ్వింది. పిరుదుల దాకా వేళ్లాడే జడ, పరికిణీ, వోణీ, చేతులకి గాజులూ, తలలో పూలూ, అచ్చం బాపు బొమ్మలా వున్న నన్ను చూసి ఆశ్చర్యపోయింది. నా పశ్చిమ గోదావరి మేకప్ చూసి ముక్కుమీద వేలేసుకుని అడిగింది.

"ఏమే, అక్కడ మీరంతా ఇలాగే వున్నారా?

"ఇంకెలా వుంటాం?" అన్నాను అమాయకంగా.

"ఎలాగా? నే చూపిస్తా!" అని, అత్తయ్య నా వేషం పూర్తిగా మార్చేసింది. చూరీదార్, కుర్తా దాని మీద వల్లీ, లిప్‌స్టిక్, జుట్టు కత్తిరించలేదు గానీ, భుజాల వరకూ వదులుగా పడేలా ఏదో వేసింది. అద్దంలో చూసుకుంటే నన్ను నేనే గుర్తుపట్టలేకపోయాను. అసలు నేను ఆంధ్రా అమ్మాయిని అంటే ఎవరూ నమ్మరు. సంతోషంతో మురిసిపోయాను.

మా అత్తయ్య నన్ను బొంబాయంతా తిప్పింది. మొదట్లో ఆ కార్లూ, జనం గాభరా పెట్టినా త్వరలోనే అలవాటయింది. అప్పటికే రెండుసార్లు కొలాబాలో మా పిన్నిగారింటికి వెళ్లాం. ఆ ఏరియా బాగా పరిచయమైంది. మళ్లీ ఓసారి మా పిన్నిగారింటికి వెళ్లవలసి వచ్చింది. అత్తయ్యకు వేరే పనుండి నన్ను తీసుకువెళ్లడానికి వీలవలేదు. వెళ్లగలనని ధైర్యంగా చెప్పాను. అత్తయ్య, నాకు మా పిన్ని ఇంటికి చేరే వివరాలన్నీ రాసిచ్చింది. పైగా ఎవరికో ఫోన్ చేసి నన్ను బస్ స్టాప్ దగ్గర రిసీవ్ చేసుకోమంది.

నేను బయలుదేరి కొలాబాలో సస్సూన్ డాక్ దగ్గర దిగాను. నన్ను తీసుకువెళ్లవలసిన మనిషి రాలేదు. కొంతసేపు చూసి, నేనే ఇల్లు వెతుక్కుంటూ ఓ చుట్టు తిరిగాను. లాభం లేకపోయింది. మళ్లీ బస్ స్టాపుకే చేరుకున్నాను. ఎవరిని అడగాలో ఏం చెయ్యాలో తోచలేదు. ఒకామె బస్‌స్టాప్ దగ్గర నాలుగేళ్ల బాబుతో నుంచుంది. చూడ్డానికి చాలా స్టైల్‌గా వుంది. స్లీవ్‌లెస్ బ్లౌజు, పచ్చని శరీరం మిద జారిపోతున్న నైలెక్స్ శారీ, బాబ్డ్ హెయిర్, లిప్‌స్టిక్, హైహీల్స్ ... ఎంతో నవనాగరికంగా వుంది. ఏ దేశమో, ఏ భాషో! ఆమెను పలకరించాలంటేనే భయంగా వుంది. నేదు ధైర్యం చేసి ఆమె పక్కగా వెళ్లి నాకు వచ్చిన ఇంగ్లీషులో దారి అడిగాను. పాపం, మనిషి మంచిదే! నాకు ఎంతో వివరంగా ఎలా వెళ్లాలో చెప్పింది. కాని ఆవిడ యింగ్లీషు ఉచ్చారణ నాకు బోధపడలేదు. మాట, మాటకీ 'వాట్? వాట్?' అంటూ అడగడానికి మొగమాట పడ్డాను. నాకు వచ్చిన హిందీ స్వబోధిని తాలూకు హిందీ కొంత ప్రయోగించాను. వెంటనే ఆవిడ హిందీలో అనర్గళంగా మాట్లాడేసింది. నేను కర్త కర్మ క్రియ గుర్తు చేసుకుని ఓ నాలుగు మాటలు మాట్లాడేసరికి ఆవిడ ముప్పై మాటలు దొర్లించేస్తోంది. ఆవిడ బస్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తోంది. ఓ పక్క వాళ్ల బాబు నసపెడుతున్నాడు. ఇక ఆవిడను విసిగించడం ఇష్టం లేక అర్థం అయీ అవనట్టు ముఖం పెట్టి 'అచ్చా' అంటూ పక్కగా నుంచున్నాను. నా అవస్థకి ఓ నిట్టూర్పు విడిచి 'అండవనే!' అన్నాను. మా స్నేహితులం కొందరు ఓ తమిళ సినిమా చూసి ఆ మాట హాస్యంగా అనుకోడం ప్రారంభించాం. ఆ మాట పైకి అనకపోయినా బాగుండేది. అది ఆవిడ చెవిని పడి 'ఉంగళక్కు తమిళ్ తెరియుమా?' అంటూ దగ్గరకొచ్చి ధారాళంగా అరవం మాట్లాడి నన్ను కొన్ని నిముషాలు దడదడలాడించింది. మళ్లీ సందేహిస్తూ ఇంగ్లీషును ఆశ్రయించాను కాని ఫలితం లేకపోయింది.

ఆవిడ బస్సు వచ్చి, ఆవిడ అదెక్కి తుర్రుమంటే నా గతేం కావాలి? నాకు గాభరా పట్టుక్కుంది. ఆవిడ నాకు సహాయపడాలని ప్రయత్నిస్తూంది కానీ పక్కన కుర్ర వెధవ "మమ్మీ లెటజ్ గో హోమ్!" అంటూ నమిలేస్తున్నాడు. దాంతో ఆవిడకి ఓర్పు నశించి "ఓరి శని వెధవా, నిన్ను తగిలించుకున్నానేమిట్రా, నా ఖర్మ!" అని కసురుకుంది.

నాకు ప్రాణం లేచొచ్చింది. "యూ ఆర్ టెలుగూ?" అన్నాను చాటంత మొహం చేసుకుని. "యా! యూ ఆర్ ఆల్సో టెలుగూ!' అంది ఆవిడ కళ్ళు పెద్దవి చేస్తూ. "ఎస్. అయామ్ టెలుగూ!" అన్నాను. ఇద్దరం టెలుగూస్‌మే!

ఆ తర్వాత ఇద్దరం తెలుగులో హాయిగా మాట్లాడుకున్నాం. ఆవిడా మా ప్రాంతాల మంచీ వెళ్లినావిడే. కాసేపట్లో బంధుత్వాలు కూడా కలుపుకున్నాం. ఇంకా ఆవిడ బస్సు రాకపోవడంతో, మా కబుర్లు ఆవకాయ, గోంగూర పచ్చడి దాకా వెళ్లిపోయాయి. ఆవిడ దారి నాకు బోధపడేలా చెప్పింది. వెళుతూ, వెళుతూ వాళ్లింటికి రమ్మని ఆహ్వానించింది కూడా.

ఇద్దరం తెలుగువాళ్లమే. కానీ ఒకళ్ల నొకళ్లం గుర్తుపట్టలేకపోయాం. అదే మన 'టెలుగూస్'కున్న తెగులు ... సారీ టెగులూ!